నవభూమి
www.navabhoomi.in


# నూర్ భాషా దూదేకులకు చట్టసభలో అవకాశం కల్పించండి


◆ **నూర్ భాషా దూదేకులకు ఇచ్చిన హామీ నెరవేర్చండి**

**నెల్లూరు,మార్చి 7,(నవభూమి)::** నూర్ భాషా దూదేకుల సమస్యలను చట్టసభలో వినిపించే విధంగా నూర్ భాషా దూదేకులకు చట్టసభలో స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నూర్ భాష్/దూదేకుల బిసి ముస్లిం సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కోస్తాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ భాష డిమాండ్ చేశారు.నెల్లూరు నగరంలోని ప్రెస్ క్లబ్ లో విలేఖర్ల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ భాష్/ దూదేకుల బిసి ముస్లిం సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కోస్తాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ భాష మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నూర్ భాషా దూదేకుల కులస్తులందరూ అహర్నిశలు కృషిచేసి.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గెలిపించుకున్న విషయాన్ని గుర్తు చేశారు.ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ నూర్ భాషా దూదేకులకు చట్టసభలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.నూర్ భాషా దూదేకులకు చట్ట సభలో అవకాశం కల్పిస్తే.. తమ సమస్యలను చట్టసభలో గలం విపుతామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ లు నూర్ భాషా దూదేకులకు ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా చట్టసభలో అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో షేక్ బాబర్ జాన్, షేక్ ఖాజా మస్తాన్,షేక్ ఖాజా రహమతుల్లా,షేక్ సుభాన్,పాల్గొన్నారు.



# కోవూరు నియోజకవర్గాన్ని టిడ్కో పరిధిలో చేర్చండి

## పేదలకు పక్కా గృహాలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు,మర్చి 7,(నవభూమి)::**సెమి అర్బన్ ప్రాంతమైన కోవూరు నియోజకవర్గాన్ని టిడ్కో పరిధిలో చేకూర్చాలని శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గళంవిప్పారు.కోవూరు నియోజకవర్గ పరిధిలో 8,660 మంది పక్కా గృహాల కోసం దరఖాస్తు చేశారని కోవూరు మండలం పడుగుపాడు,విడవలూరు మండలం చౌకిచర్ల, కొడవలూరు మండలం చంద్రశేఖర పురంతో పాటు బుచ్చి పట్టణ పరిధిలో వున్న ప్రభుత్వ భూములలో పేదలకు పక్కా గృహాలు కేటాయించాలని కోరారు.ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతుండగా జోక్యం చేసుకున్న ఉపసభాపతి రఘురామరాజు రఘురామరాజు ఈ ప్రశ్న మున్సిపల్ శాఖా పరిధిలో రాదన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు కోవూరు నియోజకవర్గం నుడా పరిధిలో వున్న విషయాన్ని దృష్టిలో వుంచుకొని టిడ్కో పరిధిలో పరిధిలో చేర్చాలని ఉపసభాపతి ద్వారా ఆమె మంత్రి నారాయణకి విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడీ టీచర్ గురు దేవి వాస్మోల్ మందు తాగి ఆత్మహత్య యత్నం



**కాశినాయన మార్చి 0 7 (నవభూమి)** పోరుమామిళ్ళ ఐసీడీఎస్ ఇన్ చార్జి సీడీపీఓ లక్ష్మి వేదింపులు భరించలేక లేక కాశినాయన మండలంలో కోడిగుడ్లపాడు అంగన్వాడి టీచర్ గురు దేవి శుక్రవారం ఆత్మహత్య యత్నం పాల్పడింది, విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవ ప్రసాద్ ప్రభుత్వ హాస్పటల్ లో వివరాలు అడిగి తెలుసుకున్నారు .పోరుమామిళ్ళ పీఎస్ లో భాదితురాలు ఫిర్యాదు చేసినట్లు సమాచారం పరిస్తితి విషమించడంతోమెరు గైన వైద్యం కోసం కడప రిమ్స్ కు తరలింపు పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# నేడు రేపల్లెలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**బాపట్ల - నవభూమి :** నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రేపల్లెలో ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారు లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున రేపల్లె ఎంసీఏ హాల్‌లో నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చూడాలని ఆయన అధికారులకు చెప్పారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 500 స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో రూ.13.68 కోట్ల బ్యాంకు లింకెజే రుణాలను మహిళలకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా పరిశ్రమలశాఖ ద్వారా పీఎం ఈజీపి పథకం క్రింద 50 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్ల మేర రుణాల మంజూరు ఉత్తర్వులు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.రేపల్లె మున్సిపాలిటీలో మహిళలకు కుట్టు సెంటర్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకో వాలని ఆయన అధికారులకు చెప్పారు.సభా ప్రాంగణం వద్ద సంక్షేమాలు కార్యక్ర మాలను తెలియజేసే స్టాల్స్‌ను ఏర్పాటు చేయవలసిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందించిన మహిళలకు ప్రతిభా పురస్కారాలను అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఈమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖష్ జ్కెన్,అదనపు ఎస్పీ విఠలేశ్వర్,జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, డ్వామా ప్రాజెక్ట్ డ్కెరెక్టర్ విజయలక్ష్మి,డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డ్కెరెక్టర్ పద్మజ,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల,జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్,సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి,రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రోజు వారి కూలి ఆత్మహత్య..

**అద్దంకి, మార్చి 7 (నవభూమి)** అద్దంకి మండలం తిమ్మాయిపాలెంకు చెందిన కోటేశ్వరరావు (37) అప్పుల బాధతో ఇంట్లో ఉరివేసుకొని మరణించినట్లు అద్దంకి ఎస్సై ఖాదర్ భాష తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. రోజువారి కూలి పనులు చేసే కోటేశ్వరరావు వివిధ ఫైనాన్స్ కంపెనీలలో అప్పు తీసుకొని, సదరు అప్పును చెల్లించలేక,అదే సందర్భంలో తన కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో, మానసికంగా కృంగిపోయి శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని మరణించినట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్ భాష తెలిపారు.



## పంచాయితీలకు ఆదాయ వనరులు

# చెత్త నుంచి సంపద కేంద్రాలు





**ఆత్మకూరు నవభూమి** గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరుస్తూ పంచాయతీలను బలోపేతం చేసేందుకు చెత్త నుంచి సంపద కేంద్రాలు ప్రభుత్వ ఏర్పాటు చేసిందని ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మకూరు ఏఎస్పేట ఎంపీడీవోలు ఐజాక్ ప్రవీణ్ ప్రసన్నకుమారి తెలిపారు.శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నందు చెత్త నుండి సంపద ఘన వ్యర్థాల సమర్ధ నిర్వహణ కొరకు ఆత్మకూరు మండలం నందు గుర్తించబడిన స్థానిక శిక్షణ కేంద్రం ఎల్టీసీ ,కరటంపాడు ఎస్ డబ్ల్యు పీసీ షెడ్ నందు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించడమైనది. కరటంపాడు షెడ్డు , కేంద్రం నందు ఏ ఎస్ పేట మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ గార్డులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ఏఎస్ పేట ఎంపీడీవో ప్రసన్నకుమారి , ఆత్మకూరు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ కరటంపాడు గ్రామ సర్పంచ్ రేవతి ,టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు దావా పెంచల రావు, కరటంపాడు గ్రామ గార్లపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు గార్లపాటి వేణుగోపాల్ నాయుడు , ముఖ్య అతిథులుగా హాజరైనారు.చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించడానికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కరటంపాడు కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి చెత్తను ,పొడి చెత్తను విడివిడిగా సేకరించి కేంద్రాలకు తరలించి వానపాముల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ముఖ్య ఉద్దేశం అన్నారు.దీనివలన గ్రామాలలోని వ్యర్థాలు తరలింపబడి గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయనీ తెలిపారు. ఈ వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చడం వలన గ్రామాలను ఆదాయం చేకూరడంతో పాటుగా నాణ్యమైన పంట పండించడానికి వీలవుతుంది. కాబట్టి అన్ని గ్రామపంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్వహించవలసినదిగా కోరడమైనది.శిక్షణ కార్యక్రమం లో డేవిడ్ , రమేష్, ట్రైనర ఆధ్వర్యంలో నిర్వహించడం అయినది . ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఫీల్డ్ విసిట్ నిర్వహించి తడి చెత్త ,పొడి చెత్తను సేకరించి విధానము వర్మీ కంపోస్టు తయారి విధానం గూర్చి వివరించడమైనది. ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ సుబ్బరాయుడు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు .మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమంలో చివరగా అందరూ మహిళ గ్రీన్ అంబాసిడర్లకు శాలువాతో సత్కరించడం అయినది. అదేవిధంగా సర్పంచ్ రేవతి ని కూడా సన్మానించడం అయినది. మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గర్డు పాల్గొన్నారు.

## ఎస్ సి, ఎస్ టి వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహాకారాలను

# పూర్తిస్థాయిలో అందేలా చూడాలి






జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అనంతపురం, మార్చి 07 : నవభూమి** షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహాకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సాంఘిక / గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖర్చు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు అందించాల్సిన పథకాల లబ్ధి పూర్తిగా అందించాలని, ఇందులో ఎప్పటికప్పుడు పురోగతి ఉండాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎంత నిధులు ఖర్చు చేశారు అనేది ఫోటోగ్రఫీ ఎవిడెన్స్ కావాలన్నారు. ఆయా శాఖల పరిధిలో నియామకాల్లో లక్ష్యాన్ని పూర్తి చేశారా, రోస్టర్ రిజిస్టర్ మైంటైన్ చేస్తున్నారా అనేది సోషల్ వెల్ఫేర్ జెడి తనిఖీలు చేయాలన్నారు. ప్రత్యేకంగా ఒక గూగుల్ షీట్ తయారు చేయాలని, ఇందులో ఆయా శాఖలకు బడ్జెట్ ఎంత వచ్చింది, ఎంత ఖర్చు పెట్టారు, అనేది ఆధారాలతో నివేదికలు అందజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సోషల్ వెల్ఫేర్ జెడి రాధిక, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, జడ్పి సిఈఓ రామచంద్రా రెడ్డి, డిసిఓ అరుణకుమారి, ఐసిడిఎస్ పిడి బియన్. శ్రీదేవి, సిపిఓ అశోక్ కుమార్, హౌసింగ్ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డీఈవో ప్రసాద్ బాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, ఆయా శాఖల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను

# విజయవంతం చేయాలి



**ఆలమూరు నవభూమి :** ఈనెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ ను విజయవంతం చేయడానికి కొత్తపేట నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లాలని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆవిర్భావ సభ నియోజకవర్గ పరిశీలకురాలు సుంకర కృష్ణవేణి, చాగంటి మురళీ పిలుపునిచ్చారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం కొత్తపేట కాపు కళ్యా ణ మండపంలో జరిగింది. సమావేశంలో బండారు శ్రీనివాస్ ప్రసంగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీకి బలమైన నియోజకవర్గంగా గుర్తింపు పొందిందని ఈ గుర్తింపును నిజం చేస్తూ అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పిఠాపురంలో ఈనెల 14న జరిగే ఆవిర్భావ సభలో పాల్గొని కొత్తపేట నియోజకవర్గ సత్తాను నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు తరలి వెళ్లే సమయంలోను సభలోను సమన్వయంతో వ్యవహరించి సభను విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు నడుం బిగించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు కొత్తపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతంగా ఉందని కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. కుటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత గ్రామస్థాయిలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడానికి స్థానిక టిడిపి నాయకులతో సమీక్ష నిర్వహించి ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభించేలా తాను కృషి చేస్తానని బండారు శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల పార్టీ అధ్యక్షులు కంఠంశెట్టి చంటి, తోట స్వామి, చేకూరి కృష్ణంరాజు, సూరపురెడ్డి సత్య, జనసేన పార్టీ నాయకులు వేలాది రామకృష్ణ, సంగీత సుభాష్, సలాది జయప్రకాష్ నారాయణ గారపాటి శ్రీనివాస్ చౌదరి, బొక్కా ఆదినారాయణ, దొంగ సుబ్బారావు, తోట వెంకటేశ్వర్లు, పల్లికొండ సుధీర్, లంక వరప్రసాద్, కొత్తపల్లి నగేష్, పడాల అమ్మిరాజు, చింతపల్లి సత్తిపండుతోపాటు నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటిన విజయ్ కృష్ణ



**బాపట్ల - నవభూమి :** బాపట్ల శ్రీచ్కెతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఊరిబిండి విజయ్ కృష్ణ ఈనెల 1 నుండి 3 వరకు నల్గొండ జిల్లా ఎన్జీ కాలేజీలో జరిగిన 4వ సౌత్ జోన్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో సత్తాచాటాడు.ఆంధ్రప్రదేశ్ తరఫున జూనియర్స్ విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.విజయ మాధురి విద్యార్థి విజయ్ కృష్ణ ను మెడలు సర్టిఫికేట్‌తో అభినందించారు.విజయ్ కృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ విజయం పాఠశాలకు గర్వకారణంఅని తెలిపారు.ఈసందర్భంగా పాఠశాలలోనే ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు విజయ్‌కృష్ణకు అభినందనలు తెలియజేశారు.

# పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయండి

## హెచ్‌ఎంలకు జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచన






**నెల్లూరు,మార్చి 7,(నవభూమి)::** నెల్లూరు జిల్లాలో పిఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పిఎంశ్రీ నిధుల వినియోగం,పాఠశాలల్లో పెండిరగ్‌లో వున్న అభివృద్ధి పనులపై సమగ్రశిక్ష ఇంజనీర్లు, హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యానాణ్యత,మౌలిక సదుపాయాలు,విద్యార్థుల ప్రతిభాసామర్థ్యాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం పిఎంశ్రీ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తుందన్నారు.ఈ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 42పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.ఈ పథకం ద్వారా పాఠశాలల్లో కెమిస్ట్రీ,కంప్యూటర్ ల్యాబ్‌లు,క్రీడామైదానాలు,ల్కెబ్రరీలు,కిచెన్ షెడ్స్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.5.33 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు.ఇప్పటివరకు సుమారు 3 కోట్లు నిధులు ఖర్చయ్యాయని,మిగిలిన 2 కోట్ల నిధులను ఏప్రిల్ నెలాఖరులోగా ఖర్చుచేయాలని, ఎట్టిపరిస్థితుల్లో కూడా నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉండకూడదన్నారు. రాబోయే ఐదేళ్లను దృష్టిలో వుంచుకుని పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 800వరకు ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా పాఠశాలల్లో ప్లాంటేషన్,సిసి రోడ్లు మంజూరు చేస్తామని చెప్పారు.స్వచ్ఛభారత్, పిఎంశ్రీ, సమగ్రశిక్ష జనరల్ ఫండ్స్ ద్వారా మంజూరవుతున్న అన్ని నిధులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుని పిఎం శ్రీ పాఠశాలలను ఆదర్శపాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని హెచ్‌ఎంలకు పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో సమగ్రశిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య,ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు సుబ్బరాయులు,ఎఎం సుధీర్‌బాబు, పాఠశాలల హెచ్‌ఎంలు,సమగ్రశిక్ష ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దేవి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసిన బొమ్మిశెట్టి శ్రీనివాసరావు





**మాడుగుల మార్చి 7 నవభూమి :** మండల కేంద్రం మాడుగుల స్థానిక దేవి ఆలయ అభివృద్ధి దాతలు విరాళాలు అందజేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీను దంపతులు లక్షా వెయ్యి నూట పదహారు(1,01116) రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస రావు కి అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.శ్రీనివాస రావు మాజీ సర్పంచ్ దంగేటి సూర్యా రావు , ఏ ఎన్వి ప్రసాద్ కలిసి బొమ్మి శెట్టి శ్రీను దంపతులను సత్కరించారు. అలాగే వార్డు మెంబర్ ఎన్.కనక దుర్గ శ్రీనివాస్ దంపతులను వివాహ వార్షకోత్సవం సందర్భంగా సత్కరించారు.

# 9న మోద కొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం



**మాడుగుల మార్చి 7 నవభూమి** మాడుగుల : మండలం లోని ఒమ్మలి గ్రామం లో కాటా జంక్షన్ వద్ద వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ మోద కొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మార్చి 9 న ఆదివారం నిర్వహించ డానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే అమ్మవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నట్లు వారు తెలిపారు.అదే రోజు సాయంత్రం జిల్లా స్థాయి గుర్రం పందాలు , నేల వేషములు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.కావున గ్రామ ప్రజలు భక్తులు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



# డీఎంఎల్‌టీ పరీక్షల్లో మెరిసిన కావ్య

**అనంతపురంటౌన, (నవభూమి)::** డిప్లొమా ఇన మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (పారా మెడికల్) పరీక్షల పలితాల్లో అనంతకు చెందిన కావ్య రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. అనంత మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కావ్య 480కిగాను 416మార్కులతో టాప్ ర్యాంకును సొంతం చేసుకుంది. విద్యార్థినిని గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ షారోన సోనియా అభినందించారు. సీడ్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ డీఎంఎల్‌టీ పరీక్షల్లో సీడ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన హాజీమస్తాన వలి, జోగివీణ, షేక్ అసిఫ్ రాష్ట్రస్థాయిలో 2, 3, 4 ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ రంగనాయకులు తెలిపారు.

## జనరిక్ మెడికల్ షాపులపై అపోహలు తొలగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**







**బాపట్ల – నవభూమి :** జనరిక్ మెడికల్ షాపులపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీచర్స్ కాలనీలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ పరియోజన మందుల షాపును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేసి 50 శాతం ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. భారతదేశంలో ఫార్మా సూటికల్ కంపెనీలు,పరిశోధన కేంద్రాలు ప్రైవేట్ రంగాలన్నారు.అందువల్ల మందులు తయారీ,పరిశోధన హక్కులు ఫార్మ సూటికల్ కంపెనీలు కలిగి ఉన్నాయన్నారు.ఫార్మాసూటికల్ ప్రైవేట్ కంపెనీలు పేటెంట్ హక్కులు ఉన్నంతకాలం వారు అధిక ధరలకు మందులను విక్రయిస్తున్నారన్నారు.మందులు తయారీపై ఫార్మర్ సూటికల్ కంపెనీలకు కాలపరిమితి ముగిసిన తర్వాత జనరిక్ మందుల షాపులు వాటిని తక్కువ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నారన్నారు.జనరిక్ మందుల షాపుల్లో కూడా ప్రైవేట్ మందుల షాపుల్లో విక్రయించే మందుల లాగా ఉంటాయని వాటిల్లో ఎలాంటి తేడాలు ఉండవని ప్రజలందరి విషయాన్ని గమనించాలని ఆయన తెలియజేశారు.జనరిక్ మందుల షాపుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో షుగర్,బీపీ,కిడ్నీ సమస్యలు,క్యాన్సర్ వంటి రోగాలకు ఎక్కువ శాతం మందులు వినియోగించవలసి ఉంటుందని వాటి ధరలు కూడా ఎక్కువగా ఉంటాయని ప్రజలు జనరిక్ మెడికల్ షాపుల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని ఖర్చులను తగ్గించుకోవచ్చునని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా,మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు







**మాడుగుల మార్చి 7 నవభూమి :** మండల కేంద్రం మాడుగుల లో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యం లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న మహిళలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పల నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం మహిళలను పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు , జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాశర్ల బైపాస్ రోడ్డు నిర్వాసితుల ధర్నా



**అమలాపురం .మార్చ్8. నవభూమి.** బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులు శుక్రవారం మామిడికుదురు మండలం పాసర్ల పూడి లో ధర్నా చేశారు 2014లో విడుదల చేసిన గజిటెడ్ రద్దు చేయకుండా 2016లో మరొక గజిటెడ్ విడుదల చేయటం చట్ట విరుద్ధమన్నారు దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని అన్నారు అంతవరకు. అక్రమ బైపాస్ రోడ్డు నిర్మాణం నిలిపివేయాలని అధికారుల దౌర్జన్యం నశించాలని డిమాండ్ చేశారు దీనిపై హైకోర్టులో 60 కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఉచిత ఫ్రెష్ కార్డ్ పొందండి..మహిళలు బస్సులో

# ఉచిత ప్రయాణం పొందండి

- ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఫ్రెష్‌బస్ వ్యవస్థాపకులు, సీఈఓ సుధాకర్ రెడ్డి చిర్రా

Fresh Bus





**గుంటూరు,మార్చి 7,(నవభూమి)::** మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రారంభించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మార్చి 7,8 తేదీలలో హైదరాబాద్,తిరుపతి,గుంటూరు, విజయవాడ,బెంగళూర్ మార్గాల్లో ఫ్రెష్‌బస్ లో ప్రయాణించే మహిళలకు ఉచిత ఫ్రెష్ కార్డులను అందిస్తున్నామని.. ఈ ఆఫర్ ఫ్రెష్‌బస్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకునే మహిళలకు మాత్రమే అందుబాటులో ఉంటుందని,ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఫ్రెష్‌బస్ వ్యవస్థాపకులు,సీఈఓ సుధాకర్ రెడ్డి చిర్రా కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఫ్రెష్‌బస్ మహిళల కోసం ప్రత్యేకంగా ఫ్రెష్ కార్డును తీసుకొని వచ్చామని,మార్చి7,8 తేదీలలో ప్రయాణించే మహిళలకు ప్రత్యేకంగా ఫ్రెష్ కార్డులను అందిస్తున్నామని, దీని ద్వారా ఆరు నెలల పాటు చేసే 10 ట్రిప్పులపై రూ. 500 తగ్గింపు (ఒక్కో ట్రిప్పుకు రూ. 50 తగ్గింపు) పొందుతారన్నారు.ఈ ఆఫర్ %ఖీతీవంష్ట్రఎబం.ఖశీఎ%, ఫ్రెష్‌బస్ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు.ఫ్రెష్‌బస్ ప్రజలకు రవాణాను అందించడమే కాకుండా మహిళా ప్రయాణికుల నుండి అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా,వారి ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడానికి ముందడుగు వేశామన్నారు. 24/7 మహిళా హెల్ప్‌లైన్‌ను ప్రారంభించామని, మహిళలకు ఇంటర్‌సిటీ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వారి ప్రయాణాన్ని మరింత సరసమైనదిగా చేయడానికి ఉచిత ఫ్రెష్ కార్డ్ అందిస్తున్నామని,ఫ్రెష్‌బస్ ఇప్పటివరకు 6.5 లక్షల మంది ప్రయాణికులకు సేవ లందిస్తుందన్నారు.ఈ ప్రయాణీకులలో 1.94 లక్షలు అంటే 30 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నారని,గతంలో ఫ్రెష్‌బస్ లో ప్రయాణించే ప్రతి నలుగురు ప్రయాణికులలో ఒకరు మహిళ కాగా నేడు,ప్రతి ముగ్గురు ప్రయాణీకులలో ఒకరు మహిళ ప్రయాణం చేస్తున్నారని,ఇది సంస్థ సేవలపై మహిళలకు పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిభందిస్తుందన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సజావుగా ఏర్పాట్లు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**



**అనంతపురం, మార్చి 07 : నవభూమి** అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా, సజావుగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో డయాస్ ఏర్పాట్లు చేయాలని, ఆర్డీఓ, తహసీల్దార్ ఇతర అన్ని ఏర్పాట్లను త్వరితగతిన చేపట్టాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారని, జిల్లా ఇన్చార్జ్ మంత్రి , రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, పుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్ ని హాజరుకావాలని చెప్పడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకోసం జాగ్రత్తగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం కోసం స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఒక్కో స్టాల్ కి ఒక్కో సిడిపిఓని ఇన్చార్జిగా నియమించాలన్నారు. స్టేడియం బయట వెల్ కం బ్యానర్ ఏర్పాటు చేయాలని, స్టేడియం ముందు మెట్లపై ఫ్లవర్ డెకరేషన్ చేయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైతే అదనపు కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, ఐసిడిఎస్ పిడి బిఎన్.శ్రీదేవి, ఎస్డీసి ఆనంద్, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ఎల్డిఎం నర్సింహారావు, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**



**బాపట్ల – నవభూమి :** మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.మోటుపల్లి గ్రామం,మ్యూజియం నిర్మాణం,వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జరిగింది.కాకతీయులనాటి అభయ శాసనాలను తెలుగులో అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.ఇప్పటికే పురావస్తు శాఖ పరిశోధకులు, శాసనాల పరిశోధకుల ద్వారా ఆ ప్రక్రియ ప్రారంభమైందన్నారు.మూడు శాసనాలలోని తాత్పర్యం ప్రజలందరికీ అర్థమయ్యేలా సాధారణ తెలుగు భాషలోకి అనువదిస్తూ రాళ్లపై చెక్కిస్తున్నామన్నారు.ప్రాచీన కాలం నాటి ఓడరేవు,సముద్రంపై జరిగే వర్తకం,వాటి వివరాలను ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యం అన్నారు.ప్రాచీన వైభవం తెచ్చేలా ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు.కోదండరామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయించాలన్నారు.ఆ భూమికి సంబంధించిన దస్త్రాలు,వివరాలను సిసిఎల్ఏకు నివేదించాలన్నారు.ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న ఆ భూమిని ఆక్రమణల నుండి వేరు చేయాలన్నారు.చినగంజాం మండలంలోని ఆ గ్రామంలో తుపాను షెల్టర్ ఎదురుగా ఉన్న 4.5 ఎకరాల ఖాళీ భూమిని విచారించాలన్నారు.సమీపంలోని 10.9 ఎకరాల భూమిని కోదండరామ స్వామి దేవాలయానికి కేటాయించే అంశంపై దృష్టి సారించాలన్నారు.100 ఎకరాల పరిధిలోని బయోడైవర్సిటీ భూమిని పరిశీలించాలన్నారు.కాకతీయులు,చోళ రాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోనే భద్రపరచడానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.మ్యూజియం నిర్మాణంపై పురావస్తు శాఖకు సమగ్ర నివేదికతతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు.ఈ ప్రాంతానికి చెందిన ప్రాచీన సంపద ప్రస్తుతం హైదరాబాద్ మ్యూజియం,చెన్నై మ్యూజియం,విజయవాడ మ్యూజియంలో ఉందన్నారు.వాటిని తెప్పించడానికి దస్త్రాలను సిద్ధం చేయాలన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన విలువైన విగ్రహాలు పొరుగు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రాచీన కాలం నాటి బుద్ధుడి విగ్రహాన్ని భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన మార్గనిర్దేశం చేశారు.జిల్లాస్థాయి కమిటీలో చర్చించిన అంశాలలో పురోగతి కనిపించేలా అధికారులు వేగంగా పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు.వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధితో మోటుపల్లి మరింత ప్రాచుర్యం పొందనుందన్నారు.పురావస్తు శాఖ అధికారుల సహకారంతో మ్యూజియం ఏర్పాటుపై కమిటీలోని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్,దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు,శాసనాల పరిశోధకులు డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు,ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంస్థ అధ్యక్షులు డాక్టర్ పిసి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పక్కా గృహాల నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలి



**బాపట్ల – నవభూమి :** పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు.పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండిరగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.జిల్లాలోని పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో మొదటి త్రైమాసికంలో బాపట్ల జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం అన్నారు.ప్రస్తుతం 454 మాత్రమే పూర్తి చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలాల వారి లక్ష్యాలలో 18 కంటే తక్కువ లక్ష్యాలను పూర్తిచేసిన ఇంజనీర్లకు చార్జి మెమోలు తయారు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారిని ఆయన ఆదేశించారు.మిగిలినవన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయని వారిని ఉద్యోగం నుండి తొలగించుటకు చర్యలు తీసుకుంటామని ఆయన అధికారులను హెచ్చరించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు.నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు.వేమూరు నియోజకవర్గంలో లేఔట్‌ల దగ్గర ఏర్పాటు చేసిన కరెంటు వైర్లను దొంగిలించిన విషయమై ఆయన ఆరా తీశారు. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు.స్వచ్ఛందసంస్థల ద్వారాఇళ్ళు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.గృహ నిర్మాణాలు జరిగిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు.లబ్ధిదారులను చైతన్యపరచి,గృహాలు నిర్మించుకునేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు,ఈఇలు,డిఈలు,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభలలో 50 శాతం మహిళలు వచ్చినప్పుడే మహిళా అభివృద్ధి

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**





**బాపట్ల – నవభూమి :** చట్టసభలలో 50 శాతం మహిళలు వచ్చినప్పుడే మహిళా అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు.లెమన్ అండ్ స్పూన్,గోనెసంచులతో పరుగు పందెం,టగ్ ఆఫ్ వార్,స్పీడ్ వాక్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలలో మహిళ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.క్రీడా పోటీలను కలెక్టర్ సందర్శించారు.ఉత్సాహంగా పాల్గొన్న మహిళ ఉద్యోగినులను ఆయన అభినందించారు.అనంతరం మహిళ అధికారులైన ఆర్డిఓ పి.గ్లోరియా జిల్లా ఖజానా శాఖ అధికారి కామేశ్వరి, జిల్లా సమాచార,పౌర సంబంధాల అధికారి కే.సుభాషిని,సిడిపిఓ లక్ష్మీపార్వతిలను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదుగా ఏపీ జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు.క్రీడా పోటీలలో పాల్గొన్న ఉద్యోగులందరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు.మహిళలపై లింగ వివక్షత లేకుండా ప్రతి కుటుంబంలో చిన్నారులను నైతిక విలువలతో పెంచాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు.అప్పుడే సమాజంలో అత్యాచారాలు జరగకుండా నివారించగలమన్నారు.మహిళలు సామాజిక,ఆర్థిక,రాజకీయ రంగాలలో సగభాగం ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలరన్నారు.లింగ వివక్షతను రూపుమాపాలన్నారుప్రతి ఇంటి నుండే లింగ వివక్షతను అరికట్టాలన్నారు. లింగ వివక్షతకు వ్యతిరేకంగా చిన్నారులలో చైతన్య తీసుకురావాలన్నారు.మహిళల హక్కులు సమానంగా అందరికీ రావాలంటే అందరూ కృషి చేయాలన్నారు.వారి రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.సమాజంలో మహిళలు సగభాగమని వివరించారు.మహిళలు వారి కాళ్లపై వారు నిలబడే పరిస్థితులు ఆర్థికంగా వచ్చినప్పుడే మహిళలకు స్వాతంత్రం ఉంటుందన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన హక్కులు ఉన్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ చెప్పారు. మహిళలను చిన్నచూపు చూడరాదన్నారు.పిల్లలను పెంచే మంచి బాధ్యత కుటుంబంలో మహిళలపైనే ఉందన్నారు.కుటుంబ నిర్వహణలోనూ,ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంలోనూ మహిళలు తమ శక్తి యుక్తులను సమర్థంగా చాటారన్నారు.పోటీలలో ప్రథమ,ద్వితీయ స్థానాలలో నిలిచిన విజేతలకు ప్రభుత్వం నిర్వహించే మహిళా దినోత్సవం వేడుకలలో బహుమతులను అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాస్,డిఎస్‌డి ఓకె పాల్ కుమార్,ఏపీ జేఏసీ చైర్మన్ సురేష్,మహిళ విభాగం చైర్ పర్సన్ రజిని,మహిళ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో కాలనీకి రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**మీకోసం - మీ వెనిగండ్ల పర్యటనలో ఎమ్మెల్యే....**

**హమాలీల స్థితిగతులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకునీ...సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెడతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే రాము**

**ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం...**

**గుడివాడ–నవభూమి:** టిడ్కో కాలనీ సమీప ఎన్టీఆర్ కాలనీ వాసుల రవాణా ఇబ్బందులను తొలగించేలా... ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం సాయంత్రం గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మీకోసం మీ వెనిగండ్ల పర్యటన నిర్వహించారు. పర్యటనలో భాగంగా బంటుమిల్లి రోడ్డులోని ముఠా కార్మికులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు.. ఈ సందర్భంగా హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము... సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దిష్టి పెడతానని వారికి భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ముఠా కార్మికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.టిడ్కో కాలనీలో నివాసముంటున్న తమకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామంటూ పలువురు కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగ తక్షణమే స్పందించి ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు. త్వరలో కాలనీకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు.అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా శ్రేయస్సే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు.

